# సాక్ష్యం

ఆ రోజు శనివారం.

ఉదయం పదిన్నరకి రోజులా ఆఫీస్‌కి వెళ్ళలేదు విజయానంద్. కారులో సరాసరి మలక్‌పేటలోని రేస్‌కోర్స్‌కి వెళ్ళాడు. ఆ రోజు జాక్‌పాట్ కొట్టినవాడు అదృష్టవంతుడు. అంతకు మునుపు జరిగిన రేస్‌లో ఎవరూ జాక్‌పాట్ సాల్వ్ చేయలేకపోయారు. కొన్ని లక్షల మొత్తం "కారీ ఫార్వర్డు" అయింది శనివారం రేస్‌కి. ఆ వుత్సాహంతో ఆఫీస్‌కి వెళ్ళకుండా సరాసరి రేస్‌కోర్స్‌కి చేరుకున్నాడు విజయానంద్.

లక్‌డీకాపూల్ ప్రాంతంలో వున్న రాష్ట్రప్రభుత్వానికి సంబంధించిన ఓ కార్యాలయంలో ప్రధానాధికారిగా పనిచేస్తున్నాడు విజయానంద్. క్లాస్‌వన్ ఆఫీసర్. నాలుగంకెల జీతం వస్తున్నా, డబ్బుమీద ఆశచావలేదు విజయానంద్‌కి. అతనికున్న ఒకేఒక చెడ్డ అలవాటు గుర్రప్పందాలు.

హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు కాబట్టి విజయానంద్ రాకపోకల మీద ఆంక్షపెట్టే వారెవరూ లేరు ఆఫీస్‌లో. సాధారణంగా ఉదయం పదకొండున్నర పన్నెండు మధ్య ఆఫీసుకి వెళ్ళి మూడున్నర నాలుగు మధ్య ఇంటికి వెళ్ళిపోతాడు. అత్యవసరమయిన పనివస్తే ఇంటికి ఫోన్ చేస్తారు. ఆఫీసునుంచి సూపరింటెండెంట్ కాని, హెడ్‌క్లర్క్ గాని అలా అవసరం వచ్చిన సందర్భాలు అతి స్వల్పం.

విజయానంద్ ఏభై జాక్‌పాట్ టిక్కెట్లు కొనుక్కొని బైనాక్యులర్స్‌తో రేసులని ఆసక్తిగా గమనించసాగాడు. పెప్సు తాగుతూ హుషారుగా. "కమాన్ క్వీన్ ఆఫ్ క్వీన్స్" అనో, "ఫాస్టర్ ఫాస్టర్" అనో అరవసాగాడు తనుకూడా మిగతావాళ్ళతోపాటుగా.

*  *  *

సతీ సమేతంగా మంత్రిగారు సినిమాకు వచ్చారా రోజు. ముందరే చెప్పటం వలన ఆ థియేటరు యజమాని మంత్రిగారిని స్వయంగా వారి కోసం ప్రత్యేకించిన సీట్లలోకి తీసుకెళ్ళాడు.

"సినీమా చాలా బావుందండి" అన్నాడు థియేటర్ యజమాని. ఓ పావుగంట తనుకూడా కూర్చుని తర్వాత పనివుందని లేచి వెళ్ళిపోయాడు.

* * *

ఆ మర్నాడు రెండు గంటలకే వెళ్ళిపోయాడు విజయానంద్ ఆఫీస్‌నుంచి. సాయంత్రం నాలుగున్నరకి ఆఫీసునుంచి ఫోన్ వచ్చింది. హెడ్‌క్లర్క్ కంగారుగా చెప్పాడు. "సర్! మంత్రిగారి పి.ఏ. ఫోన్ చేశారు మీకోసం ఇప్పుడే"

"దేనికి?"

"తెలియదు వంట్లో బాగుండక ఇప్పుడే ఇంటికి బయలుదేరారని చెప్పాను. ఓ పావుగంటాగి మీకు ఫోన్ చేస్తానన్నారు."

"సరే అయితే"

పదినిమిషాల తర్వాత మళ్ళీ ఫోన్ మ్రోగింది.

మంత్రిగారి పి ఏ.

"ఉన్నపళంగా మంత్రిగారు మిమ్మల్ని వాళ్ళఇంటికి వెళ్ళి కలుసుకోమని చెప్పారు మీ కోసం ఎదురుచూస్తున్నారు"

క్లిక్.

ఆదరాబాదరా విజయానంద్ కారులో మంత్రిగారింటికి వెళ్ళాడు. తలనిండా ఆలోచనలతో.

"వెల్ మిస్టర్ విజయానంద్! నా మంత్రిత్వశాఖ కింద వచ్చే ఆఫీసులలో పని సరిగా జరగడంలేదన్న ఆరోపణ వచ్చింది. మూడు వారాల క్రితం శనివారం మీరు ఆఫీసులో చేసినపని డైరీ ఇవ్వండి రేపు మధ్యాహ్నంలోగా. గుర్తుంటే ఇప్పుడే రాసివ్వండి"

"గుర్తుంది రొటీన్ వ్రాసిస్తాను సర్"

ఉదయం పదిన్నరనుంచి సాయంత్రం అయిదున్నరదాకా తను చేసే పనిని వ్రాసి అందించాడా కాగితం. ఆ కాగితాన్నందుకుని చిన్నగా నవ్వి అడిగారు.

"ఆ రోజు సెలవలో లేరా మీరు?"

"ఉహు"

"అలా అయితే మిమ్మల్ని సస్పెండ్ చేస్తున్నాను"

విజయానంద్ నోటమాటరాలేదు. తెల్లబోతూ చూశాడు మంత్రి గారిపంక

"యస్. యు ఆర్ సస్పెండెడ్. రేపు ఉదయం సస్పెన్షన్ ఆర్డర్ టైపు చేంఃంచి అందజేస్తాను. శ్రద్ధగా పనిచేసే వుద్యోగులు కావాలినాకు. జూదం ఆడేవాళ్ళుకాదు."

"మీరేమంటున్నారో— ఎవరిగురించి మాట్లాడుతున్నారో అర్థం కావటంలేదు నాకు"

"మీ గురించే"

"నన్ను సస్పెండ్ చేయాల్సిన అవసరం ఏమిటి?"

"పర్మిషన్ లేకుండా ఆఫీసుటైంలో ఆఫీస్ వదిలి బయటికి వెళ్ళటం, ఆఫీస్‌కి టైం రావటం లేదని కూడా తెల్సింది"

"అబద్ధం"

"అబద్ధం ఆడకు మిష్టర్ విజయానంద్. మీరు ఇచ్చిన డైరీ నా జేబులో వుంది. అది అబద్ధం అని నిరూపించడానికే అడిగి తీసుకున్నాను. ఆ రోజు మలక్‌పేటలోని రేసుల కెళ్ళారు మీరు అవునా? కాదా?"

"కాదు"

చిన్నగా నవ్వారు మంత్రి.

"ఐ హేవ్ ఫుల్ ప్రూఫ్ ఎవిడెన్స్. ఇండియన్ న్యూస్ రివ్యూ వారు ఆ రోజు రేసుని చిత్రీకరించారు. ప్రేక్షకులలో కూర్చున్న కొంత మందిని కూడా చిత్రీకరించారు నిన్నరాత్రి సినిమా కెళితే ఐ.ఎన్.ఆర్.లో మీరు కనిపించారు నోట్లో పైప్‌తో చేతిలో బైనాక్యులర్స్‌తో స్పష్టంగా కనిపించారు మీరు. ఇక మీరు వెళ్ళవచ్చు. ఆఫీస్ టైంలోనే జరిగిందా రేస్."

విజయానంద్ తనని బతిమాలుకునే అవకాశం ఇవ్వకుండా మంత్రి గారు తన ఇంట్లోని విజిటర్స్ గదిలోంచి లోపలికి వెళ్ళిపోయారు.